క్లుప్తంగా

టీకాలతోనే పశువులకు ఆరోగ్యం



పశువులకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

కౌటాల: గాలికుంటు నివారణ టీకాలు వేస్తేనే పశువులు ఆరోగ్యంగా ఉంటాయని పశువైద్యాధికారి ఎస్. శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని తలోడి గ్రామంలోని పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా టీకాల కార్యక్రమం చేపడుతుందన్నారు. నెలరోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో టీకాల కార్యక్రమం నిర్వహిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సందీప్, సత్యనారాయణ, భిక్షపతి, ప్రకాశ్ పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: బైక్ అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొన్న ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కాగజ్‌నగర్ మండలంలోని బొడపల్లి గ్రామనికి చెందిన శ్రీకాంత్ (25) బైక్‌పై ఆసిఫాబాద్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో బూర్గుడ సమీపంలోని బీఈడీ కళాశాల వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో శ్రీకాంత్ తలకు చేతులకు గాయాలయ్యాయి. స్థానికుల గమనించి 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కాగజ్‌నగర్‌కు తరలించారు.

బుద్ధుడి బోధనలు అనుసరించాలి



శోభాయాత్ర నిర్వహిస్తున్న బుద్ధ భక్తులు

ఇంద్రవెల్లి: బుద్ధుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పూజ్య బంతే జీవక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ త్రిరత్న బుద్ధ విహార్‌లో నిర్వహించిన వర్షవాస్ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మిలింద్‌నగర్ నుంచి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, వాగ్మరే కామ్‌రాజ్ మస్కే రాజువర్ధన్, సునీల్, శివాజీ పవార్, బుద్ధ భక్తులు పాల్గొన్నారు.

'మంత్రి సీతక్కకు రుణపడి ఉంటాం'



మంత్రి సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మార్కెట్ చైర్మన్, నాయకులు

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామం వద్ద నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ. 3 కోట్ల 30 లక్షల నిధులు మంజూరు చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. గురువారం మంత్రి సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ధన్నూర్ గ్రామానికి గతంలో వచ్చిన మంత్రి ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేసి మాట నిలబెట్టుకున్నారని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంటి, వినయ్ రెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కుమురం భీంకు నివాళి

- ఊరూరా భీం వర్ధంతి
- నివాళులర్పించిన ఆదివాసీ నాయకులు, అధికారులు



ఆసిఫాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



వాంకిడి: పూలమాలలు వేస్తున్న నాయకులు



బెజ్జూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

కౌటాల: పోరాట యోధుడు కుమురం భీం ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కౌటాల ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. గురువారం ఎంఈవో కార్యాలయం ఎదుట భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో చింతలమానెపల్లి ఎంఈవో పి. జయరాజు, నారులే వానుపటేల్, తిరుపతి, మధుకర్, అశోక్, నివాస్, జ్ఞానేశ్వర్, సుమన్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ఆదివాసీ హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఆదివాసీ కుమురం భీం వర్ధంతిని గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో భీం వర్ధంతి నిర్వహించారు. భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు.

ఆసిఫాబాద్‌రూరల్: కుమురం భీం పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి అన్నారు. జిల్లా కేంద్రంలోని భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో పోరాటం చేసిన వీరుడు కుమురం భీం అని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు హేమంత్, రమేశ్, ఉషన్న, సుభాష్, దేవాజీ, శ్రీనివాస్, రాజన్న పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్: నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన కుమురం భీంకు జిల్లా సీపీఎం ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ గిరిజన రాజ్యాధికారాన్ని నెలకొల్పేందుకు అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. నాయకులు బండారు రవికుమార్, కూశన రాజన్న, కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, ముంజం శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, గొడిసెల కార్తీక్, జాదవ్ రాజేందర్, దిగిడ బక్కన్న, వనిత పాల్గొన్నారు. అదే విధంగా పీఆర్టీయూ నాయకులు, విశ్రాంత ఉద్యోగు సంఘం నాయకుల ఆధ్వర్యంలో దాడా నగర్‌లోని భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వాంకిడి: గిరిజన ముద్దుబిడ్డ కుమురం భీంను ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భీం విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండె తుకారాం, తుడుందెబ్బ నాయకుడు ఆత్రం సాయినాథ్, బీఆర్ఎస్ నాయకులు రాకేశ్, అశుతోష్, అహ్మద్, రాహుల్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని జిల్లెడ గ్రామంలో భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన హక్కుల కోసం నిజాంకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. గిరిజనుల హక్కుల కోసం ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దహెగాం: జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో నిజాం సర్కారుతో పోరాడి అసువులు బాసిన కుమురం భీం ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని ఆదివాసీ మన్నేవార్ యువజన సంఘం అధ్యక్షుడు కొడిపె నవీన్ అన్నారు. మండలంలోని బీబ్రా గ్రామంలో కుమురం భీం వర్ధంతి నిర్వహించారు. భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ మన్నేవార్ సంఘం ఉపాధ్యక్షుడు అల్లకొండ లక్ష్మణ్, ఆదివాసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు సలుగుపల్లి, సులుగుపల్లి, ముంజంపల్లి గ్రామాల్లో భీం వర్ధంతిని నిర్వహించారు. భీం విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సోయం చిన్నన్న, మెస్రం రాజారాం, తలండి మధుకర్, విశ్వేశ్వర్, కోరేత లలయ్య, రమేశ్, ఆత్రం రామయ్య పాల్గొన్నారు.



కౌటాల: నివాళులర్పింస్తున్న ఉపాధ్యాయులు



సిర్పూర్(టి): నివాళులర్పిస్తున్న ఎంపీడీవో



దహెగాం: నివాళులర్పిస్తున్న మన్నేవార్ సంఘం నాయకులు



పెంచికల్‌పేట్: జిల్లెడలో..



కాగజ్‌నగర్‌రూరల్: పీఆర్టీయూ ఆధ్వర్యంలో...

మంత్రి సీతక్కకు వినతులు వెల్లువ



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్టీలు


రెబ్బెన: రాష్ట్ర మంత్రి సీతక్కను గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి గెస్ట్‌హౌస్ వద్ద కలిసిన ప్రజలు, కాంట్రాక్టు ఉద్యోగులు, ప్రజా సంఘాలు, తెలంగాణ ఉద్యమకారులు, నర్సరీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు అందచేశారు. గోలేటిలోని సింగరేణి నర్సరీలో పని చేస్తున్న కార్మికులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఆసుపత్రి బుక్కులు అందించేలా చూడాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కార్మికులు సీతక్కను కలిసి వినతిపత్రం అందచేశారు. ఐటీడీఏ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలకు మినిమం టైమ్స్ స్కేల్‌ను ఇప్పించాలని మంత్రిని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల అయ్యేలా కృషి చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలోని పాల్గొని జైలు జీవితాలు అనుభవించిన ఉద్యమకారులను ఆదుకోవాలని, ఉద్యమకారులకు ఇంటి స్థలం మంజూరు చేయటంతో పాటు ఉద్యమకారుల సంక్షేమానికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని వినతిపత్రం ద్వారా మంత్రిని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఉచిత బస్సు సౌకర్యం, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్, తెలంగాణ ఉద్యమకారులు బాబురావు, దుర్గం రవీందర్, తోట లక్ష్మణ్, సీఆర్టీలు గోపాల్, నగేశ్, వెంకటేశ్, రవి, గణపతి, గోపిచంద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని మూడోవ అంగన్‌వాడీ కేంద్రాన్ని, 18వ నంబరు గల రేషన్ పంపిణీ కేంద్రాన్ని గురువారం మండల ప్రత్యేకాధికారి వాజీద్ అలీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బియ్యాన్ని పరిశీలించారు. ప్రజలకు, అంగన్‌వాడీ కేంద్రంలో నాణ్యమైన బియ్యాన్ని అందిస్తామన్నారు. బియ్యాన్ని పక్కదారి పట్టించవద్దని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ త్రియంబక్, తదితరులున్నారు.

సర్వే నామమాత్రమే..!

- హద్దులు ఏర్పాటు చేయడంలో అధికారుల వెనుకడుగు
- నాయకుల ఒత్తిడే కారణమా?



సర్వే రిపోర్టు కాపీ

బెజ్జూర్: ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులది. అయితే అధికారులు మాత్రం తమకు ఏమి సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో మండల కేంద్రంలో సర్వే నం.237తో పాటు మరో సర్వే నంబర్‌లో దాదాపు రెండు ఎకరాలకు పైచిలుకు భూమి వదిలిపెట్టినట్లుగా పెద్దలు చెబుతుంటారు. అది గత కొన్ని సంవత్సరాల నుంచి అక్రమణకు గురవుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గత కొన్ని రోజుల క్రితం ప్రభుత్వ భూములు భద్రమేనా? అనే కథనం 'సాక్షి'లో ప్రచురితం కావడంతో బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన పలు యువకులు హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని తహసీల్దార్‌కు విన్నవించారు. దీంతో సర్వేయర్ శ్రీకాంత్ రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేపట్టారు. ప్రభుత్వ భూమి అనుసంధానం మొత్తం పట్టా భూములతో పాటు గృహాలు నిర్మించి ఉన్నందున సర్వే చేయలేక పోతున్నామని సంబంధిత తహసీల్దార్‌కు సర్వే రిపోర్ట్ అందించి చేతులు దులుపుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుమతులు లేకుండా కట్టడాలు..

బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు ప్రధాన చౌరస్తాలైన సలుగుపెల్లి ఏజెన్సీ ప్రాంతం అయినప్పటికీ కూడా ఇతర కులాలకు చెందిన వారు కూడా భవనాలు కడుతున్నట్లు సమాచారం. అలాగే బారెగూడెం ప్రధాన రహదారుల వెంబటి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు చేపడుతున్నారు. అయినా.. రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎవరి ఒత్తిడి..

ప్రభుత్వ భూములు అక్రమిస్తున్నా.. అధికారులు మాత్రం పట్టించు కోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఒకరిద్దరూ రాజకీయ నాయకులు అక్రమాలు చేయడంతోనే సరిగ్గా సర్వే చేయలేక పోతున్నారనే అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల్లో సైతం ప్రభుత్వ భూములు లేక నూతన భవనాలు మంజూరైతే నిర్మించడానికి చాలా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. అయితే అధికారులు మాత్రం కనీసం వాటి గురించి ఆలోచించే విధంగా కూడా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై బెజ్జూర్ సర్వేయర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా, గృహాలు ఉన్నందున సర్వే నిర్వహించలేక పోయామని సమాధానం ఇచ్చారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పెంచికల్‌పేట్: నివాళులర్పిస్తున్న తహసీల్దార్



రెబ్బెన: పూలమాల వేస్తున్న తహసీల్దార్

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామంలో గురువారం ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాల్మీకి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. రామాయణాన్ని రచించిన గొప్ప కవి వాల్మీకి అన్నారు. ఆలయంలో భక్తులు భజన కార్యక్రమం నిర్వహించి, అనంతరం అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రౌతు రాందాస్, పుజారి నారాయణ్ పటేల్, బాలాజీ, మోరేశ్వర్, ఫకీరా, భాస్కర్, తిరుపతి పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ రామ్మోహన్ రావుతో పాటు సిబ్బంది వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. రామాయణం రచన ద్వారా సమాజానికి ఎన్నో నీతి వ్యాఖ్యలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రేంకిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో..

గోలేటి టౌన్‌షిప్‌లోని ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. జీఎం శ్రీనివాస్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహేరా, అధికారులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సనాతన ధర్మ రచనలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేశ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణపతికి సన్మానం



టాకిరే గణపతిని సన్మానిస్తున్న సభ్యులు

బెజ్జూర్: మండలంలోని పెద్ద సిద్దాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిరే గణపతిని మాలీ సంఘం సభ్యులు సన్మానించారు. స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించిన ఆయనను గురువారం మండల కేంద్రంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి చదివి కొలువు సాధించి టాకిరే గణపతి యువతకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఉద్యోగం సాధించిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బెజ్జూర్ మండల మాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన లారీ అసోసియేషన్ నాయకులు



సమస్యలు వివరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లారీ అసోసియేషన్ నాయకులు గురువారం ఎమ్మెల్సీ దండె విఠల్‌ను కలిశారు. సమస్యను వివరిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారని, పేపర్ మిల్లు యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరించాలని సూచించారని లారీ అసోసియేషన్ అధ్యక్షుడు వెన్న కిశోర్‌బాబు తెలిపారు. న్యాయమైన డిమాండ్ల అమలుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అలరించిన సంప్రదాయ నృత్యం



డెంసా నృత్యం చేస్తున్న విద్యార్థులు



ప్రజాఫిర్యాదుల విభాగాన్ని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క



కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో గురువారం నిర్వహించిన కుమురం భీం వర్ధంతి సందర్భంగా మహారాష్ట్రతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కొలాం గుస్సాడీ, డెంసా, అర్జుని (మహారాష్ట్ర), కనక రాజు డెంసా, రేలా కొలం డెంసా విద్యార్థుల నృత్యం అలరించింది. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేశారు. దీన్ని మంత్రి సీతక్క పరిశీలించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్, తదితరులు పాల్గొన్నారు. - కెరమెరి